

హుస్నాబాద్‌లో

హుస్నాబాద్/బెజ్జంకి: నియోజకవర్గంలోని పలు రోడ్ల విస్తరణకు రూ.50 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ప్రధాని మోదీ, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సీఆర్ఐఎఫ్ నిధులు హుస్నాబాద్ నుంచి రామవరం రోడ్డు విస్తరణకు రూ.25కోట్లు, అంతకపేట నుంచి కొత్తకొండ రోడ్డు విస్తరణకు రూ.25కోట్లు మంజూరు పై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట మండల అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, రామంచ మహేందర్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వరూప, నాయకులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి మండలం పోతారం క్రాసింగ్ నుంచి గన్నేరువరం వరకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేశారని బీజేపీ నేతలన్నారు.

క్షీరాభిషేకం

కొమురవెల్లి(సిద్దిపేట): మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ మహిళా సంఘాల నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం మంజూరు చేయడమంటే తమ సాధికారతను పెంపొందించడమేనన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి కనుకరాజు, లింగంపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, జంగని రవి, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్



కొండపాక(గజ్వేల్): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండల పరిధిలోని దుద్దెడలో కేంద్ర సీఐఎస్ఎఫ్ పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఓటు హక్కు ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటు హక్కు విఘాతం కలిగించే వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది, బలగాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నర్సాపూర్ పరిధిలో ఉన్న 33కేవీ , 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులున్న కారణంగా శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏడీఈ రవిందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పటేల్‌పురా, అంబేడ్కర్ నగర్, సంజీవయనగర్, వెములవాడ కమాన్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయిగల్లి, సాజిద్‌పుర, వివి నగర్, పారుపల్లి, నర్సాపూర్, కరీంనగర్ రోడ్, హనుమాన్‌నగర్, దోబిగల్లి, లాల్‌కమాన్, డబుల్‌బెడ్రూం నర్సాపూర్ ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో సీడీఎఫ్ నిధుల నుంచి చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీష్, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, గదరాజు చందు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



చెల్లాపూర్ పాఠశాలలో వంటగది శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్ దేవలక్ష్మి

దుబ్బాకటౌన్: పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ 2 వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలో రూ.3 లక్షలతో వంటగది నిర్మాణానికి కౌన్సిలర్ గోనెపల్లి దేవలక్ష్మి సంజీవరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. 15 ఫైనాన్స్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండల్‌రెడ్డి, రవి, నర్సింహులు, రాజు, ప్రకాశ్, రాకేష్, మహేష్, బాలకృష్ణ, మధు, రవి తదితరులు ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కొండపాక(గజ్వేల్): మండల సర్వసభ్య సమావేశానికి మెజారిటీ సభ్యులు హాజరవ్వకపోవడంతో ఈనెల 18 సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇటీవల ఎంపీపీ ర్యాగల్ల సుగణపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈక్రమంలో శుక్రవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి తిమ్మారెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యులు దేవి రవీందర్, ఖమ్మంపల్లి ఎంపీటీసీ సభ్యులు యాదగిరి మాత్రమే హాజరయ్యారు. సమావేశం ప్రారంభ సమయానికి సుమారు గంట సమయం దాటినా సభ్యులెవ్వరూ హాజరుకాలేదు. దీంతో కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంఈఓ వీరరాజు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు కనక వర్షం

- 8 వారాల్లో బుకింగ్ ఆదాయం రూ.4.26 కోట్లు
- హుండీ ఆదాయం రూ. 3.60 కోట్లు
- మరో నాలుగు వారాలు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలు



రాజగోపురం వద్ద భక్తుల సందడి (ఫైల్), ఇన్‌సెట్‌లో స్వామి వారి మూల విరాట్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుంది. దీంతో స్వామికి కాసుల వర్షం కురుస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్జిత సేవాలు, హుండీ ద్వారా భారీగా ఆదాయం స్వామి వారి ఖజానాకు చేరుతోంది. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలోనే వచ్చి మొక్కులు చెల్లించుకునే వారు. ప్రస్తుతం సంవత్సరం పాటు ప్రతి ఆది, బుధ వారాల్లో వచ్చి పూజలు చేస్తున్నారు. అలాగే సంవత్సరం పొడవునా దర్శనానికి వస్తుండటంతో ఆదాయం భారీగా పెరిగిందని ఆలయ ఈఓ చెబుతున్నారు. బ్రహ్మోత్సవాలు మొదలైన జనవరి 21 నుంచి ఇప్పటి వరకు హుండీ ద్వారా రూ 3,60,23,345, అర్జిత సేవల ద్వారా రూ 4,26,91,147ల ఆదాయం సమకూరింది.

రోజురోజుకూ పెరుగుతున్న ఆదాయం

జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్జిత సేవలు పట్నం, బోనాలు, అభిషేకం ప్రసాద విక్రయ, కేశఖండన, వసతి గదుల అద్దె మొదలగు సేవల ద్వారా మెదటి వారం రూ. 70,22,307, రెండో వారం రూ.59,71,343, మూడో వారం రూ. 55,70,464, నాల్గో వారం రూ. 56,12,921, ఐదో వారం రూ. 56,03,330,ఆరో వారం రూ. 37,79,389, ఏడో వారం రూ.36,13,367, ఎనిమిదో వారం రూ. 55,18,026 మొత్తంగా రూ. 4,26,91,147 ఆదాయం సమకూరింది.

రికార్డు స్థాయిలో...

స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు ఆలయంలోని హుండీలను 3 సార్లు లెక్కించారు. హుండీ లెక్కించిన ప్రతి సారీ కోటి రూపాయాలు ఆదాయం దాటింది. జనవరి 25న జరిపిన లెక్కింపులో రూ 1,39,77,230, ఫిబ్రవరి 16న రూ.1,15,59,209, మార్చి14న లెక్కిస్తే రూ.1,04,86,906 ఆదాయం వచ్చింది. ఈ మొత్తంగా ఆదాయం రూ 3,60,23,345 సమకూరింది. 8 వారాల్లో స్వామి వారి ఖజానాకు అర్జిత సేవాలు, హుండీ ద్వారా రూ 7,87,14,492ల ఆదాయం సమకూరింది. మహోత్సవాల్లో మిగిలి ఉన్న నాలుగు వారాల్లో మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం



స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో వారి రాక పెరిగింది. అదే రీతిలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. వారు సంతోషంగా స్వామి వారిని దర్శించుకుని కానుకలు హుండీలో వేయడంతో ఆదాయం పెరిగింది.

– ఆలయ ఈఓ బాలాజీ

సర్వే కోసం ధర్నా

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమికి సర్వే చేయలేదని ఆ గ్రామస్తులు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ యాదగిరి మాట్లాడుతూ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వేనంబరు 1060, 1061లలో కొంత భూమి ఆక్రమణకు గురైందన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని దీంతో ఇటీవల హైదారాబాద్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయానికి అందిన ఆదేశాల మేరకు శుక్రవారం నాడు ఆర్ఐ, సర్వేయర్‌లు ప్రభుత్వ భూమికి కొలతలు వేసి హద్దులు చూపుతారని ఆర్డీఓ బన్సీలాల్ పేర్కొన్నారన్నారు. ఆర్ఐ సమాచారం అందించినా గానీ



ధర్నా నిర్వహిస్తున్న ఖమ్మంపల్లి గ్రామస్తులు

కొలతలు వేసేందుకు రాలేదన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దిలీప్ నాయక్ మాట్లాడుతూ తాము ఇటీవల బాధ్యతలు చేపట్టామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కొండపాక(గజ్వేల్): ప్రసవ నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలిలా.. అంకిరెడ్డి పల్లికి చెందిన తాళ్ల మౌనికకు ప్రసవ సమయం దగ్గర పడింది. దీంతో సిద్దిపేటలోని ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం భర్త లాళ్ల చందన్ బైక్‌పై తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో కమాన్ వద్దకు రాగానే నొప్పులు మొదలయ్యాయి. వెంటనే 108కు ఫోన్ చేయగా.. సిబ్బంది మహేందర్, శ్రీనివాస్‌లు చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తూనే వైద్యుల సూచనల మేరకు సుఖ ప్రసవం చేశారు. ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. దీంతో మౌనిక కుటుంబీకులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

బెజ్జంకి(సిద్దిపేట): ఆరోగ్యమే మహాభాగ్యమని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల పేర్కొన్నారు. బెజ్జంకి అంగన్‌వాడీ–2 కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయమ్మతో కలిసి ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు పోషకాహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యంగా చురుకుగా ఉంటారన్నారు. గర్భిణులు, శిశువులకు పౌష్టిహారాన్ని అందించేందుకు కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శారద, సూపర్‌వైజర్లు నాగరాణి, కవిత, రేణుక, సుజాత, కిరణ్, పద్మ, సులోచన, అనిత, జయలక్ష్మి, భూదేవి, కనుకలక్ష్మి, జమున, కవిత తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయ చేయాలి

బెజ్జంకి, గూడెంలో అర్హులైన దళితులకు మూడెకరాల భూపంపిణీలో న్యాయం చేయాలని ఎంపీపీ లింగాల నిర్మల కోరారు. బెజ్జంకిలో రిలే దీక్షలు చేస్తున్న దళితుల శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోఆప్షన్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్, లక్ష్మారెడ్డి, బాలనర్సు, శ్రీనివాస్, మోహన్, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుతో అధిక ఆదాయం

చేర్యాల(సిద్దిపేట): వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని దానంపల్లిలో వరి, మొక్కజొన్న పంటలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. అంకురం ఏర్పడిన పది రోజుల లోపల గుళికలు వేస్తే తెల్లకంకులు రాకుండా నివారించవచ్చన్నారు.

అంతకుముందే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నివారణకు క్లోరాన్ ట్రానిలిప్రోల్ 0.3 మి.లి గానీ కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 2గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దాన్ని అరికట్టేందుకు ఇమా మెక్టిమ్ బెంజోయెట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో గానీ లేదా క్లోరాంట్రినిల్ 0.4 ఎం.ఎల్ గానీ పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉనికి గమనించే లింగాకర్షక బుట్టలు ఎకరానికి 8 నుంచి 10 అమర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాస్తారోకో

సదుపాయాలు కల్పించి కాలేజీని తరలించాలని డిమాండ్



రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని వసతులు కల్పించిన తర్వాతనే కళాశాలను ప్రారంభించాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్ వర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తక్షణమే నూతన కళాశాలలోకి షిఫ్ట్ చేయాలని, ఆ తర్వాతనే అన్ని సదుపాయాలు వస్తాయని మంత్రి ప్రభాకర్ మాట్లాడటం సరికాదన్నారు. మరో పది రోజుల్లో పరీక్షలు ఉన్నాయని ఇలాంటి సమయంలో సౌకర్యాలు లేని కళాశాలకు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ కళాశాలకు కొమ్ముకాసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య, నాయకులు రాకేష్, రాజేష్, రాహుల్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

పెంపకంలో తల్లి పాత్ర గొప్పది: హెచ్ఎం విఠల్



తల్లుల ఆశీర్వాదాలను తీసుకుంటున్న విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): పెంపకంలో తల్లి పాత్ర చాలా గొప్పదని హైస్కూల్ హెచ్ఎం విఠల్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో శుక్రవారం మాతృవందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు మాతృమూర్తులకు పాదాభివందనాలు చేస్తూ ఆశీర్వాదాన్ని పొందారు. భారతీయ సంప్రదాయంలో తల్లి పాత్ర ఎంతో విశిష్టమైందన్నారు. ఏ కార్యం మొదలు పెట్టినా ముందుగా అమ్మ ఆశీర్వాదం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాలమల్లయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మండలంలోని సింగాయపల్లిలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవ వేడుకలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆయనకు ఉత్సవ నిర్వాహకులు శేషవస్త్రంతో సన్మానించారు.

◆ సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. వార్డులోని మజీద్ పక్కనున్న వీధిలో స్థానిక కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్‌తో కలిసి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పనులను ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, నాయకులు నాగరాజు, గణేష్, చంద్రశేఖర్, సురేష్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశంగౌడ్, సాజిద్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

◆ మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పరామర్శ

హుస్నాబాద్: పట్టణంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. పట్టణానికి చెందిన వడ్డెపల్లి వెంకటరమణ కూతురు శ్రీజ మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణానికి చెందిన గడిపె లక్ష్మి మృతిచెందగా వారి కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న కురుమలను గుర్తించి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిందం రాజమల్లయ్య, జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కురుమలు అధిక సంఖ్యలో తమ వృత్తిని కొనసాగిస్తూ జీవిస్తున్నారన్నారు. అనేక ప్రభుత్వాలు ఇప్పటి వరకు తమను గుర్తించిన సందర్భం లేదన్నారు. కేవలం ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు చూస్తున్నాయన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కోటగిరి ప్రభాకర్, కంతుల ఎల్లం, కంతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ అల్పాహార పథకాన్ని కొనసాగించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహార పథకాన్ని కొనసాగించాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఈ పథకాన్ని తిరిగి కొనసాగించాలని, అలాగే దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలకు గురైన అట్రాసిటీ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మన్ చెన్నారెడ్డికి శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించి చర్చించినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, వేతనాలను చెల్లించక పోవడంతో అప్పులు చేసి మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్నారన్నారు. ఇందుకు గాను చెన్నారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

◆ కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

గజ్వేల్‌రూరల్/ వర్గల్: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన కులాలను గుర్తిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామనే నిర్ణయం హర్షణీయమని జిల్లా ముదిరాజ్ జేఏసీ, గజ్వేల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ ముదిరాజ్, పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి మొదటిసారి ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ముదిరాజ్‌ల తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు. వర్గల్‌లో.. కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి కూడా కమిటీల ఏర్పాటు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

◆ అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు

సిద్దిపేటరూరల్: గ్రామ అభివృద్ధి కోసం జిల్లా ఇన్‌చార్జి, మంత్రుల నుంచి ప్రత్యేక నిధులు తీసుకువస్తున్న క్రమంలో బీజేపీ నాయకులు వాటిని అడ్డుకోవద్దని ఫిషర్‌మన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఇదిలా ఉంటే కొందరు స్థానిక బీజేపీ నాయకులు ప్రొటోకాల్ విషయంలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

◆ మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ జి.నర్సయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం మేనేజర్ ప్రభాకర్‌కు ఇన్‌చార్జ్‌గా ఇచ్చిన సీడీఎంఏ తిరిగి శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కమిషనర్ నర్సయ్యకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చింది.

◆ భూమి పూజ

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మంద చందసాగర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. దీంతో ఇప్పుడు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని గుర్రాలగోందిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బర్మ రామచంద్రం సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. లోక్‌సభ స్థానాలకు ఎన్నికల జరగనున్నాయని కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, సేవాదళ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాజ్‌వీర్, ఫిషరీస్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బాబేష్, బీసీ సెల్ నాయకులు యాదగిరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి

హుస్నాబాద్: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదువుకోవాలని, మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని, ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్సై మహేష్ అన్నారు. శుక్రవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై పట్టణంలో సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే ఓ గోల్ ఏర్పరుచుకొని దానికి అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులను ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల హెచ్ఎం విజయ్ రెడ్డి, హుస్నాబాద్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ,శివకుమార్ తదితరులు ఉన్నారు.

◆ డీలర్‌పై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యక్తిపై దాడి చేసిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరామ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... రుద్రారంలో డీలర్ నాగభూషణం అక్రమంగా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన పోతారం మురళి గ్రామస్తుల సమక్షంలో నిలదీశాడు. దీంతో మురళితో అతను గొడవ పడ్డారు. తనపై అకారణంగా దాడి చేసిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. పట్టణంలో ఇటీవల తనిఖీలు చేయగా 34 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చారు. విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ.15,900 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ బీజేపీ మండలాధ్యక్షుడిగా నాగరాజు

కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ మండల అధ్యక్షుడిగా బుర్గోజు నాగరాజును నియమిస్తూ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.